అంతా నిర్మానుష్యం

- సందడి లేని కూడళ్లు
- ఎటు చూసినా కర్ఫ్యూ వాతావరణమే
- కొనసాగుతున్న పండగ మూడ్

జగదాంబ: భోగి, సంక్రాంతి, కనుమ వంటి వరుస పండగల నేపథ్యంలో జనంతో కళకళలాడిన రహదారులు నేడు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వాణిజ్య సముదాయాలైన జగదాంబ నుంచి వన్‌టౌన్ వరకు ఎక్కడా జనసంచారం లేదు. ఇసుక వేస్తే రాలనంతగా జనాల తాకిడి ఉండే ఈ ప్రాంతాల్లో ప్రయాణం సులువు కాదు. ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్‌తో రద్దీగా ఉండేవి. అయితే భోగి, సంక్రాంతి, కనుమ పండగల నేపథ్యంలో ప్రజలు, వ్యాపారులు ఊళ్లకు వెళ్లడంతో నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.



దుర్గాలమ్మ జంక్షన్ దరి వెలంపేటకు వెళ్లే రహదారి



వెలవెలబోతున్న రామకృష్ణా రైతుబజార్ జంక్షన్

బ్యారెక్స్..



జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిన పోలీస్ బ్యారెక్స్ రహదారి

ఇది పరిచయం అవసరం లేని ప్రాంతం. పుట్టిన రోజులు, పండగలకు నగర నలుమూలల నుంచి సాధారణ, మధ్య తరగతి ప్రజలు వచ్చి ఇక్కడ కావలసిన వస్త్రాలు కొనుగోలు చేస్తుంటారు. సంక్రాంతి సమయంలో అడుగు వేయడానికి కూడా వీల్లేని పరిస్థితి. ఇప్పుడు చూస్తే జనం లేక వెలవెలబోతోంది.

పూర్ణామార్కెట్..



పూర్ణామార్కెట్ రోడ్డు

నిత్యం జన సంచారంతో కళకళలాడే పూర్ణామార్కెట్ రోడ్డు పండగ తర్వాత వెలవెలబోతోంది. భోగి, సంక్రాంతి నేపథ్యంలో వ్యాపారులంతా ఊళ్లకు వెళ్లిపోవడంతో మార్కెట్ నిర్మానుష్యమైపోయింది. పండగ మూడ్ తర్వాతే ఇది మళ్లీ కళకళలాడుతుంది.

పందుపుల్లల సందు..



ఖాళీగా దర్శనమిస్తున్న పందుపుల్లల సందు

పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో వస్త్రాలు అందించే చోటు పందుపుల్లల సందు. ఇక్కడ దొరకని మ్యాచింగ్ గానీ, కలర్లు గానీ ఉండవు. నగరంలో అన్ని షాపింగ్ మాల్స్‌కు ఎంత వ్యాపారం జరుగుతుందో సంక్రాంతి నేపథ్యంలో అంతటి వ్యాపారం ఇక్కడ జరుగుతుంది. అటువంటి ప్రాంతం ఇప్పుడు జన సంచారం లేక వెలవెలబోతోంది.

75 ఫీట్‌రోడ్డు-జనతాబజార్..



జనతా బజార్ రోడ్డు

నిత్యం కళకళలాడే 75 ఫీట్ రోడ్డు – జనతాబజార్ మార్కెట్ దుస్తులు, ఎలక్ట్రికల్ వస్తువులకు పేరెన్నిక గన్నది. డిసెంబర్‌లో వచ్చే క్రిస్మస్ నుంచి ఈ ప్రాంతం జనాల తాకిడితో రద్దీగా ఉంటుంది. వరుస పండగల తర్వాత ఈ ప్రాంతం సందడి లేకుండా అయిపోయింది.

జగదాంబ..



వెలవెలబోయిన జగదాంబ-వన్‌టౌన్ రహదారి

ఇక్కడి షాపింగ్ మాల్స్‌కు ఎంత గిరాకీ ఉంటుందో అందరికీ తెలుసు. అలాగే ఫుట్‌పాత్ వ్యాపారాలకు కూడా ఈ ప్రాంతం పెట్టింది పేరు. వరుస పండగల నేపథ్యంలో ఈ ప్రాంతం కిటకిటలాడింది. ఇప్పుడు మాత్రం జనం లేక బోసిపోయింది.

19 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

దాబాగార్డెన్స్: ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్ ఐదు రోజుల పాటు విశాఖలో అందుబాటులో ఉంటారని వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 23 వరకు రామ్‌నగర్‌లోని జీవీఎంసీ ఔట్ గేట్ ఎదురుగా గల వైద్యరాజ్ ఔషధాలయంలో ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందజేయనున్నట్టు తెలిపారు. హైపర్ టెన్షన్ (ఆందోళన), ఆర్థరైటిస్ (కీళ్లవ్యాధులు), పక్షవాతం, నడుంనొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ నాయర్ అందుబాటులో ఉండి చికిత్స అందజేయనున్నారని చెప్పారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునే వారు 9133106060, 9030568264 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కుటుంబ సభ్యుల చెంతకు యువకుడు



కుటుంబ సభ్యులతో దీపక్‌శర్మ

సీతమ్మధార : బిలాస్‌పూర్‌కు చెందిన దీపక్ శర్మను మూడేళ్ల కిందట ఏయూటీడీ సిబ్బంది గుర్తించి షెల్టర్‌కు తరలించారు. అతనికి ఒక సోదరుడు, ఆరుగురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. ఆడపిల్లలు ఆస్తిలాక్కుని అన్నదమ్ములిద్దరినీ రోడ్లపాలు చేశారు. దీపక్ అన్న పానీపూరి అమ్ముతాడు. దీపక్ గంజాయి, భంగుకి అలవాటు పడి అనారోగ్యం పాలయ్యాడు. అన్నకు తెలిస్తే కొడతాడని భయపడి ఇల్లు వదిలి పారిపోయాడు. వైజాగ్‌లో ఏయూటీడీ సిబ్బంది ఇతన్ని రెస్క్యూ చేశారు. మూడేళ్ల వైద్యం తర్వాత దీపక్ శర్మ కోలుకోవడంతో శ్రద్ధా సంస్థ ద్వారా అన్న సంజయ్‌శర్మకి క్షేమంగా అప్పగించినట్లు ఏయూటీడీ కన్వీనర్ వాసు తెలిపారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం



ఫ్రైడే డ్రైడే సందర్భంగా అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

అల్లిపురం: ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా యూనిట్ ఆఫీసర్ శేషుబాబు తెలిపారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా శుక్రవారం కల్లుపాకలు ప్రాంతంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో చెత్తా చెదారాలు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కొబ్బరి బోండాలు, పాత టైర్లు ఉండరాదన్నారు. దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రఘు, కేఎస్‌వీ కుమార్, ఏఎన్‌ఎం సీహెచ్ నాగమణి, ఆశ వర్కర్ ఆదిలక్ష్మి, మలేరియా ఇన్‌స్పెక్టర్ జీవీ రమాదేవి, మలేరియా సిబ్బంది బి.శంకరరావు, డి.పద్మ, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మి అమ్మవారికి సహస్ర తులసీదళార్చన..

శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు అమ్మవారికి సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

ఆదర్శమూర్తి జ్యోతిబసు



జ్యోతిబసుకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అల్లిపురం: సీపీఎం మొదటితరం నాయకుడు, పశ్చిమ బెంగాల్ పూర్వ ముఖ్యమంత్రి జ్యోతిబసు ఆదర్శమూర్తి అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్వీ కుమార్ కొనియాడారు. జ్యోతిబసు 15వ వర్ధంతి సందర్భంగా పార్టీ విశాఖ జిల్లా కార్యాలయములో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో రైల్వే కార్మికులకు యూనియన్ స్థాపించి వారి సమస్యల పరిష్కారానికి జ్యోతిబసు కృషి చేశారన్నారు. తర్వాతి కాలంలో స్వాతంత్రోద్యమం జరుగుతున్న నేపథ్యంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ బెంగాల్‌లో కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని ఐక్యం చేసి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. సీపీఎం పార్టీ ఆలిండియా పొలిట్‌బ్యూరోలో నవరత్నాలలో జ్యోతిబసు ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో వై.రాజు, వి.కృష్ణారావు, కామేశ్వరరావు, ఎం.ప్రదీప్, వి.ఎస్.కుమార్, కె. కుమారి, కొండమ్మ, చంద్రమౌళి, ఎం.సూరీడు, లక్ష్మీపతి, శివ, భారతి, గణేష్, నరసింగరావు, పట్టాభి పాల్గొన్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం



నాడు మురుగు ప్రవహిస్తూ ఇలా..



నేడు సమస్య పరిష్కారమై ఇలా..

సాక్షి ఎఫెక్ట్..

దాబాగార్డెన్స్: సాక్షి కథనానికి జీవీఎంసీ స్పందించింది. 'రహదారిపై మురుగుతో ఇక్కట్లు' పేరిట సాక్షి శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు. జిల్లా పరిషత్ సమీపాన గల శ్రీకృష్ణ చైతన్య మఠం సమీపంలో భూగర్భ డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. ఈ మార్గాన ఎంతో మంది ప్రజా ప్రతినిధులు జిల్లా పరిషత్‌కు వెళ్తున్నారు. ఉద్యోగులు..సిబ్బంది కూడా ఇటుగానే ప్రయాణిస్తుంటారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులకు వెళ్లే వారు కూడా ఈ రహదారి గుండానే వెళ్తూ అవస్థలు పడుతున్న దృశ్యా.. సాక్షి కథనం ప్రచురించింది. సీసీ రోడ్డు పనులు జరుగుతున్నందున యూజీడీ క్లియర్ చేయడం జరగక, యూజీడీ ఓవర్ ఫ్లో అవ్వడం జరిగిందని, సంబంధిత వార్డు శానిటేషన్ సెక్రటరీ, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆ ప్రాంతానికి వెళ్లి పీహెచ్ వర్కర్లచే యూజీడీ క్లియర్ చేయించారు.

నేడు రెండు ప్రాంతాల్లో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్-స్వచ్ఛ విశాఖ' కార్యక్రమం

విశాఖ సిటీ: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రతి నెల 3వ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్-స్వచ్ఛ విశాఖ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం(18వ తేదీ) ఉదయం 10 గంటలకు సెంట్రల్ పార్క్ వద్ద, అనంతరం 11.30 గంటలకు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలతో పాటు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనవసరమైన కాగితాలను తొలగించాలని తెలిపారు. సంస్థ నిర్వహణలో ఉన్న అన్ని పార్క్‌లలో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ పరిధిలోని వాణిజ్య సముదాయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని శత శాతం నిషేధించాలని ఆదేశించారు. తప్పని సరిగా వస్త్ర లేదా కాగితపు సంచులను మాత్రమే ఉపయోగించాలన్నారు. విధిగా పొడి చెత్త, తడి చెత్తలకే వేర్వేరుగా చెత్త బుట్టలను వినియోగించాలని సూచించారు.

శతవర్ష చిహ్నం..



ఆంధ్రా మెడికల్ కాలేజీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన చిహ్నం పలువురిని ఆకట్టుకుంటోంది.
ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పదపదవే వయ్యారి గాలిపటమా..

- చిన్నారుల పతంగుల సందడి



చెకాపంక్ అయిన గాలిపటాన్ని చేజిక్కించుకున్న బాలుడు



రైలు పట్టాలపై గాలిపటాలు ఎగురవేస్తున్న పిల్లలు



చెకాపంక్ అయిన గెద్దను తీసుకుని పరిగెడుతున్న బాలుడు



గెద్దంటే ఇలా ఎగరాలి..

దాబాగార్డెన్స్: వారం రోజుల పాటు సంక్రాంతి సెలవుల్లో మునిగి తేలిన పిల్లలు, యువకులు సోమవారం నుంచి బడులు/కళాశాలలకు వెళ్లనున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున గాలిపటాలు ఎగురవేసేందుకు ఆసక్తి కనబరిచారు.

కొని తెచ్చుకుంటున్న ప్రమాదాలు..

గాలి పటాల పోటీలు వేసుకోవడం.. ఆపై చెకాపంక్ (పోటీలో ఓ వర్గానికి చెందిన గాలిపటం) అయిన గాలిపటాన్ని చేజిక్కించుకోవడానికి రోడ్లపై పరుగులు తీస్తు కొంత మంది చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరికొంత మంది కుర్రాళ్లు మేడలు.. మిద్దెల పైనుంచి పడిపోతున్నారు. ముఖ్యంగా మురికివాడ ప్రాంతాలైన ప్రసాద్‌గార్డెన్స్, బొడారా రోడ్డు, రామకృష్ణా జంక్షన్, పండావీధి, వెలంపేట తదితర ప్రాంతాల కుర్రకారు గాలిపటాల పోటీల్లో నిమగ్నమవుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

గాలిపటం ఎక్కడికెళ్లినా..

పోటీలో తెగిపోయిన గాలిపటం ఎక్కడ తేలుతుందో తెలియదు కానీ.. వాటి వెంబడి పిల్లలు పరుగులు తీస్తున్నారు. ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో గాలిపటాల పోటీలు వేసుకున్న వారిలో ఓ గెద్ద (గాలిపటం) తెగిపడి పోర్టు పరిసర ప్రాంతాల్లో పడితే.. దాన్ని చేజిక్కించుకోవడం కోసం చిన్నారులు పోర్టులోకి వెళ్లిపోతున్నారు.

అధునాతన పద్ధతిలో మహిళకు శస్త్ర చికిత్స



న్యూరో సర్జన్ డాక్టర్ ప్రశాంత్

మహారాణిపేట: రామ్‌నగర్‌లో ఉన్న ఓమ్ని ఆర్.కె.ఆస్పత్రిలో అధునాతన పద్ధతిలో మినిమల్ ఇన్వేసివ్ బ్రెయిన్ అండ్ స్పైన్ శస్త్ర చికిత్సను శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఆస్పత్రి న్యూరోసర్జన్ డాక్టర్ తాళ్లూరి ప్రశాంత్ ఆధ్వర్యంలో వైద్య బృందం శస్త్ర చికిత్స చేసింది. గాజువాక ప్రాంతానికి చెందిన 27 ఏళ్ల యువతి మూడో అంతస్తు నుంచి కిందకు పడిపోయారు. దీంతో ఆమె వెన్నెముక, పాదాల ఎముకలు విరిగిపోయాయి. ఆస్పత్రి న్యూరో సర్జన్ డాక్టర్ తాళ్లూరి ప్రశాంత్ గాయపడ్డ యువతికి అతి చిన్నగాటుతో అత్యాధునిక పద్ధతిలో శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ విధానం వల్ల రోగి త్వరగా కోలుకోవడంతో పాటు శస్త్ర చికిత్సకు అవసరమయ్యే వ్యయం తగ్గుతుందని, రోగి ఒక్క రోజులోనే సాధారణ స్థితికి వస్తారని డాక్టర్ ప్రశాంత్ తెలిపారు.

హానికారక ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం



ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు తదితరులు

జగదాంబ: మానవవాళికి, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. గురువారం జోన్ పరిధి 35వ వార్డు పూర్ణామార్కెట్ వద్ద వ్యాపారులతో కలిసి నిషేధిత ప్లాస్టిక్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనవరి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధంలో ఉన్నారు. ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించడం వల్ల ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధి ప్రబలుతుందన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయమైన చెరకు పిప్పి, విస్తరాకులు, అరటి ఆకులు, గన్నీ బ్యాగ్‌లు, మొక్కజొన్నతో తయారు చేసిన కవర్లు, పేపర్‌ప్లేట్లు, గ్లాసులు ఉపయోగించాలన్నారు. ఇంటి వద్ద నుంచే స్టీల్ బాక్స్‌లు, సంచులు తీసుకెళ్లి వస్తువులు కొనుగోలు చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ విక్రయించే వారిపై మొదటిసారి రూ. 20 వేలు, రెండవసారి రూ. 40 వేలు జరిమానా విధిస్తామన్నారు. అప్పటికీ మానకపోతే ట్రేడ్‌లైసెన్స్ రద్దు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చిరు వ్యాపారులకు కూడా మొదటిసారి రూ. 2500, రెండవసారి రూ. 5 వేలు అపరాధ రుసుము విధిస్తామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలతో టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. నెలరోజుల పాటు ఇదే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఫిబ్రవరి 1 నుంచి పూర్తిస్థాయిలో నిషేధిత ప్లాస్టిక్‌ను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 వినతులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 వినతులు అందినట్టు చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రధాన సిటీ ప్లానర్ పాల్గొన్నారు. అందిన వినతుల్లో జోన్-2 నుంచి 2, జోన్-3 నుంచి 3, జోన్-4 నుంచి ఒకటి, జోన్-6 నుంచి 2 వినతులు అందినట్టు చెప్పారు. దరఖాస్తులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు

సెయిల్‌లో విలీనంతోనే ఉక్కు భవిత



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న గాజువాక జోన్ సీపీఎం కార్యదర్శి రాంబాబు, మాజీ కార్పొరేటర్ ఈశ్వరమ్మ తదితరులు

సీతమ్మధార: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పూర్తిగా మనుగడ సాధించాలంటే సెయిల్‌లో విలీనం చేయాలని గాజువాక జోన్ సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు,మాజీ కార్పొరేటర్ బొట్ట ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 1,389 రోజు కొనసాగింది. ఈసందర్భంగా రాంబాబు, ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఆర్థిక ప్యాకేజీ స్టీల్ ప్లాంట్ కొంతమేర ఆర్థిక సమస్యల నుంచి బయటపడడానికి తాత్కాలిక ఉపశమనంగా ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీ శాశ్వతమైన పరిష్కారం కాదని వారు చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే, సొంత గనులు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ బలమైన సంస్థగా ఎదుగుతుందని చెప్పారు. దీనిపైన కూడా కేంద్రం ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదన్నారు. ఆర్థిక ప్యాకేజీ ఏ రూపంలో ఇస్తున్నారో స్పష్టం చేయలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమించాలని.. అవసరమైన వసతులు కల్పించి పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. రిలేనిరాహార దీక్షలో గొలగాని అప్పారావు, ఎ. నూకేశ్వరరావు, భానుమూర్తి, ఆనంద్ పాల్గొన్నారు.

హోంగార్డుగా కారుణ్య నియామకం



చెక్కు అందజేస్తున్న సీపీ బాగ్చీ

విశాఖ సిటీ: విశాఖ నగర హోంగార్డు యూనిట్‌లో పని చేస్తూ అనారోగ్యంతో మరణించిన మహ్మద్ హాషం భార్య జరీనా కౌషర్‌కు కారుణ్య నియామకం కింద హోంగార్డుగా నియమించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.6,89,410 చెక్కును కూడా అందించారు.